International Journal for Multidisciplinary Research (IJFMR)

E-ISSN: 2582-2160 ● Website: www.ijfmr.com ● Email: editor@ijfmr.com

# సీతా కళ్యాణం రమణీయ దృశ్యకావ్యం

**డా. తన్నీరు సురేశ్**

సహాయ ఆచార్యులు(తెలుగు), ప్రభుత్వ డిగ్రీ& పీ.జీ. కళాశాల, లక్షెట్టిపేట . జిల్లా: మంచిర్యాల , తెలంగాణ రాష్ట్రం, చరవాణి

**Abstract (వ్యాస సంగ్రహం):**

రామాయణం అనేక మాద్యమాలలో సమాజనికి చేరింది. అందులో సినిమా మాద్యమం అనేది ఎక్కువ జనసమూహానికి రామాయణాన్ని చేర్చింది. ప్రసిద్ధ చిత్రకారుడు బాపు దర్శకత్వంలో తీసిన సినిమా సీతాకళ్యాణం ఒక రమణీయ దృశ్యకావ్యం. ఈ సినిమాలో పాటలు, సంగీతం, ఫొటోగ్రఫీ, సాంకేతిక వైభవం, నటనా వైభవం, చిత్రీకరణలో కొత్తదనం అనేవి సినిమాను గొప్పగా మలిచాయి. ఈ వ్యాసంలో బాపు తీసిన రామాయణం సినిమాలు, సీతాకళ్యాణం ప్రాధాన్యత, జట్టుకుర్పు ,పాటలు, సంగీతం నటన, సాంకేతికత మొదలుగా సీతాకళ్యాణం సినిమాలో గల విశేషాలు తెలుపబడినాయి.

**Key words (కీలక పదాలు):** రామాయణం ప్రాధాన్యత, సినిమాలలో రామాయణం, బాపు తీసిన రామాయణం సినిమాలు, సీతా కళ్యాణం సినిమా వివరాలు, విశేషాలు సీతాకళ్యాణం , దృశ్యకావ్యం సౌందర్య వీక్షణం, రాముని అందం, సీతాకళ్యాణం పాటల ప్రత్యేకత, సాంకేతిక ప్రతిభ. నటన, దృశ్య చిత్రణ, వ్యాపార విజయం, ముగింపు

## 1. Introduction (ఉపోద్ఘాతం):

రామాయణం వినిన,రాసిన, చూసిన,పాడిన,ఆడినా ఆనంద0. రాముని కథ అదర్శాల పట్టుకొమ్మ. అలాంటి రామాయణం కథను వెండితెర మీద దండిగా చూపిన సినిమాలు అసంఖ్యాకం. రాముడు భారతీయ ఆత్మ. ఆ రూపం భారతీయ సినిమాలలో దాదాపు ప్రతి భాషలో నిర్మించ బడింది. తెలుగు సినిమాలలో లవకుశ సంపూర్ణ రామాయణం, శ్రీరామ పట్టాభిషేక0 వంటి చిత్రాలు ఎన్నో రాముని కథను ప్రజలకు విజయవంతంగా చేర్చాయి. నాటి లవకుశ మొదలు నేటి ఆదిపురుష్ వరకు రామాయణం ప్రతికాలంలో సక్సెస్ సినిమా వస్తువే. కేవలం సినిమాలే కాదు లఘుచిత్రాలు, యూట్యుబ్ వీడియోలు, షార్ట్స్ రీల్స్ , ఫేస్ బుక్ ఇలా రామునికి సంబంధించిన ప్రతి సృజన మాద్యమ రూపం మళ్ళీ మళ్ళీ పునరావృతం నిత్య నూతనం. ఆదరణ విజయం.

రామాయణంకు సంబంధించిన తెలుగు చలన చిత్రాలలో బాపు తీసిన సీతాకళ్యాణం ఒక అపురూప దృశ్య సౌందర్య కావ్యం. సీతాకళ్యాణం సినిమా కథ కన్నా వర్ణనకు, సౌందర్య ప్రదర్శనకు, శబ్ద రసాత్మకతకు, సంగీతసుధకు, పాటల హాయికి ప్రాధాన్యత ఇచ్చింది. సీతాకళ్యాణంలో ఒక డ్రామా చూడటం కన్నా ఒక సమ్మోహనతను అనుభవించడం జరుగుతుంది అనవచ్చు.

సినిమా అనగానే అందులో ఎన్నో అంశాలు మిళితమై ఉన్నాయి. కళ, నటన, పర్యవేక్షణ, కృషి, పెట్టుబడి, వ్యాపారం, రాజకీయం, మనోవిజ్ఞానం, సృజనాత్మకత ఇలా ఎన్నో అంశాలు కలిసి ఒక సినిమా రూపు దిద్దుకొంటుంది. కొంత నిజం, కొంత ఊహ, కొంత

మాయాజాలం అన్నీ సినిమా తెరపైన ఆడే పాత్రలను ప్రేక్షకుల సమాజంలో భాగస్వాములుగా చేస్తాయి. (తెలుగు వికీపీడియా- పా.సూ 1) కవి ఊహను సినిమా చిత్రీకరణగా మార్చాలి అంటే అందులో అనేక దశలు అధిరోహించ వలసి వస్తుంది. ఒక్కోసారి సాధ్యం కాకపోవచ్చు కూడా, మానవ ఊహ అంతిమంగా గొప్పది అవుతుంది.

## 2. **బాపు రామాయణ సినిమాలు:**

వ్యాసుడు వేదాలను, అష్టాదశ పురాణాలను రాసిన తరువాత కూడా వాటితో పరిపూర్ణ సంతృప్తి అనిపించక భాగవతం రాసి పరిపూర్ణ అనందం సాధించాడు. అలా చూస్తే బాపుగారికి సీతాకల్యాణం సినిమాకి ఇదే సంబంధం కనిపిస్తుంది. సీతాకల్యాణం సినిమా 1976సం. జులై9 న వచ్చింది. ఈ సినిమా తీసిన బాపు గారు 1971సం. లోనే సంపూర్ణ రామాయణం తీశారు. అయితే సంపూర్ణ రామాయణం తీసిన కొద్ది కాలానికే సీతా కళ్యాణం తీయడం సంపూర్ణ రామాయణంలో చూపలేని అంశాల సంతృప్తి లోటును తీర్చు కోవడమే అనువచ్చు. సీతాకళ్యాణంతో పాటు బాపు గారు మరో 3 రామాయణ సంబంధిత సినిమాలు తీశారు. అవి సంపూర్ణ రామాయణం1971 , శ్రీరామాంజనేయ యుద్ధం, 1984, శ్రీరామ రాజ్యం. 2011. బాపు గారు అంతకు ముందే బొమ్మల ద్వారా రామాయణం చూపిన వారే అయితే కదిలే బొమ్మల ద్వారా వెండితెరపై చూపడం అనేది బాపు ప్రతిభని, రామాయణం గొప్పదనాన్ని ఇంకా ఎక్కువ ప్రజా సమూహానికి చేర్చింది.

## 3. **సీతాకల్యాణం జట్టుకూర్పు:**

సీతాకల్యాణం సినిమా అనందలక్ష్మీ ఆర్ట్ క్రియేషన్స్ వారి నిర్మాణంలో వచ్చింది. సీతాకళ్యాణం సినిమా నిర్మాణంలో మంచి జట్టు కుదిరింది. ఈ సినిమా దర్శకుడు ప్రసిద్ధ చిత్రకారుడు బాపు. బాపుకి విడదీయని అనుబంధ సఖుడు ముళ్ళపూడి వెంకటరమణ సంభాషణల రచయిత. ఈ సినిమాలో సంగీతం స్వరకూర్చినది కె.వి. మహదేవన్. పాటలు మంచి శబ్దాలను కూర్చి రాసినది డా. సి. నారాయణ రెడ్డి, ఆరుద్ర. పద్యాల రచయిత గబ్బిత వెంకట్రావు. కొన్ని పాటలను త్యాగరాజ స్వామి మరియు రామదాసు కీర్తనల నుంచి గ్రహించారు. కమ్యునిస్ట్ మరియు నాస్తిక భావజాల ఆరుద్ర ఒక దేవుడి కథతో వచ్చిన సినిమాకి పాటలు రాయడం ఇక్కడ మరో ప్రత్యేకత. పాటలను రాయడం కన్నా అంతే అద్భుతంగా వినసొంపుగా పాడినది ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, పి.బి.శ్రీనివాస్,రామకృష్ణ,వాణీ జయరాం,ఎస్.జానకి,బి.వసంత.

సీతాకళ్యాణం సినిమాలో రాముని పాత్రకు అంతవరకు స్థిరపడిన యన్.టి.ఆర్. గారిని కాదని రవి అనే కొత్త పాత్రధారిణి ఎన్నుకొన్నారు. యువరాముని చూపడానికి ఈ అంశం బాగా ఉపయోగ పడింది పైగా ఎక్కువ డైలాగ్స్ కూడా ఇందులో రామునికి ఉండవు. జయప్రద సీతా సౌందర్యాన్ని రాబట్టడానికి దర్శకుడు ఎంచుకున్న సరైన ఎంపిక అనవచ్చు.

## 4. **సీతాకళ్యాణం-సాంకేతిక వైభవం:**

ఈ సినిమాకి అద్భుత సౌందర్యం చేకూరడంలో బాపు గారి ఆలోచనలు సాంకేతిక తోడ్పాటు ఇచ్చినది రవికాంత్ నుగాయిచ్ కే.ఎస్.ప్రసాద్. ఛాయాగ్రహణం. ముఖ్యంగా బాపు గారి బొమ్మల సౌందర్యం సినిమాలో కనిపించడానికి ఛాయాగ్రహణం, స్టిల్స్ పాత్ర

చాలా ముఖ్యం. సాంకేతిక వైభవం కళావైభవం ఒక చోట సమన్వయ మయ్యాయి. అందుకే బహుశా కొన్ని విషయాలలో సంప్రదాయానికి విరుద్ధంగా చూపినా కూడా భిన్నత్వమే మనోహరం అయింది ప్రజల మన్నన పొంద గలిగింది. శ్రీమహావిష్ణువును ఆదిశేషువుపై పడుకున్న దృశ్యంకు భిన్నంగా ఆదిశేషువు వృత్తంలా మధ్యలో శ్రీ మహావిష్ణువును చూపారు. ఇలాంటి ప్రత్యేక అభివ్యక్తికి బాపు కళాప్రజ్ఞా, రవికాంత్ నగాయిచ్ సాంకేతిక ప్రతిభ వీటికి అనుబంధమగా నేపథ్య సంగీతం కలిసి ప్రేక్షకులకు భిన్నత్వంమే మనోహరత్వం చేశాయి అని చెప్పవచ్చు. ఎందరో కవుల ఊహలను మరింత ఖచ్చితంగా ప్రేక్షకుడు అనుభవించడంలో సాంకేతిక పాత్ర ఎంతో గొప్పది. సీతా కళ్యాణం సినిమా నాటికి ఇప్పుడు అందుబాటులో ఉన్న డిజిటల్ సాంకేతికత లేదు. కేవలం కొద్దిపాటి కెమెరా ఆధారిత సాంకేతికత, ట్రిక్ ఫోటోగ్రఫీ, సినిమాటోగ్రఫీ మాత్రమే అందుబాటులో ఉన్నాయి వాటితోనే సీతాకళ్యాణం ఒక కన్నుల పండుగలా మార్చారు. వామనావతారం, గంగావతరణం, త్రిపురాసుర సంహారం వంటి ఘట్టాల్లో సాంకేతికత నైపుణ్యం చూడముచ్చటగా పసందుగా పదే పదే చూడాలని అనిపించేలా ఉంది.

### 5. **సీతాకళ్యాణం సినిమా కథాంశం:**

రామాయణంలోని బాలకాండలోని వస్తువు సీతాకళ్యాణం సినిమా కథ ఇందులో రావణాసురుడి ఆగడాలు భరించలేక దేవతలు ఋషులు శ్రీమహావిష్ణువును ప్రార్థించడం, దశరథుడి పుత్రకామేష్టి యాగ నిర్వహణ, తద్వారా పుత్రుల జననం, జనక మహారాజుకు సీత లభించడం విశ్వామిత్రుడు యాగరక్షణ నిమిత్తం రామలక్షణులను తీసుకువెళ్ళడం, తాటక మారీచ, సుబాహుల సంహారం రాముడు శివధనస్సు విరవడం, సీతా రాముల వివాహం ఉన్నాయి. సందర్భాన్ని అనుసరించి విశ్వామిత్రుడి కథ, అహల్య శాపవిమోచనం, వామనావతారం,గంగావతరణం, పరుశురామ గర్వభంగం ఉన్నాయి. మొత్తం సినిమాలో సీతారాముల సౌందర్య వర్ణణకు దృశీకరణకు ప్రాధాన్యత ఇచ్చారు.

### 6. **సీతాకళ్యాణం-పాటల సౌందర్యం:**

సినిమాకి అదనపు ఆకర్షణ పాటలు సినిమా ప్రారంభం నుంచీ పాటలే ప్రధాన సాధనంగా కథను అందించే ప్రయత్నం చేశారు బాపు. 2 గంటల సినిమాలో డైలాగ్స్ తో సమానంగా పాటలు వచ్చాయి. 13 పాటలు 3 పద్యాలు 3 శ్లోకాలు ఉన్నాయి. బహుశా అప్పుడు నడుస్తున్న సినిమాలకి ఇది పూర్తిగా కొత్త. వీది భాగోతాలలో, నాటకాలు, యక్షగానాలలో పాటలు పద్యాలు ద్వారా ప్రదర్శన చేస్తారు, ఇందులో కూడా అదే జరిగింది. సీతాకళ్యాణం సినిమాలో ఒక్కొక్క పాట ఒక్కో రస ఝరి. రాముని అందం వర్ణించే చోట

"కోటి కన్నుల తోటి కొలను చూసింది,
కోటి గొంతుల తోటి పులుగు పాడింది
కొమ్మ కొమ్మకు కన్ను రెమ్మ రేమ్మకు కన్ను
కూర్చుకొని ప్రతి తరువు చూసింది ...... "

మరో చోట —

"అజానుబాహువులు రాజీవ నేత్రాలు, అరునాబ్జ చరణాలు

ఎగుభుజంబులవాడు నగుమోము కలవాడు

జగమేల గల మేటి మగరాయడు

హరి విల్లు వంచు సిరి కన్నె వరించు హరిలాగ ఉన్నాడు

ఎవరీతను ఎవరీతను''

ఇలా రాముని్న కావ్యాలలో ఆయా కవులు వర్ణించిన దానికి సమానంగా కావ్య వర్ణనలకు దృశ్య చిత్రణలా సినిమా ఉంటుంది. మరో చోట —-  రాముడి అందం ఎలాంటిది అంటే 'పుమ్సాత్ మోహన రూపాయ' అంటాడు వాల్మీకి ఆ వాక్యానికి తగినట్టు

"రాముని సొగసులు పువ్వులు అయితే పొరుల చూపులు తుమ్మెదలు

వాలిన చోటును వీడగ లేవు మధుర మధుర మాసుధాలు

పదముల అందం చూసే చూపు పదముల నుండీ కదలదులే,

పెదవుల నవ్వు చూసే చూపు పెదముల వదిలి కదలదులే

రాముని అందం మకరందం రసమయమైనది ప్రతి దండం

రాముని చరణం అరవిందం కొలచిన చాలును అనందం." ఇలా రాముని శరీర వర్ణన దానికి తగిన దృశ్యం ప్రేక్షకులను మరో లోకంలో విహరింప జేస్తాయి.

రాముడు గొప్ప సమ్మోహన ప్రభావం కలిగిన వాడు అందుకే అతడిని చూసే కళ్ళు ఏ అంగం మీద దృష్టి పడితే ఆ స్థలం నుండి మరో చోటుకి దృష్టి మార్చాలని అనిపించడం లేదు తనివి తీరా అందాన్ని అనుభవించడం అని అర్థం. పైగా  దృష్టి మారిస్తే మళ్ళీ ఈ  అందం దొరకదేమో అన్నంత ఆత్రంగా చూస్తున్నారు ప్రజలు. ఇంత గొప్ప కథానాయక వర్ణన ఇప్పుడు ఏ  సినిమాలో ఉంది ఏ వెబ్ సిరిస్ లో ఏ రీల్ లో ఉంది ఏ ఇంస్టాగ్రామ్ లో ఉంది చెప్పండి. సీతను వర్ణించే చోట "అవును అవును అందాల రాశి కాముడు కన్నా మాయమ్మ అల్లన మెల్లన పొరాడుతుంటే హంసధ్వనులే నోయమ్మ ఘల్లు ఘల్లు గజ్జెల మోత చల్లని గానమే అవునమ్మ" అనే పాటలో సీతా సౌందర్య వర్ణన చేశారు.

గంగావతరణం సీతాకల్యాణం సినిమాకి గొప్ప బలం. ఒక పాటతో గంగావతరణాన్ని బాపు చూపారు. అప్పటి సాంకేతిక స్థాయిని బట్టి ఉన్నంతలోనే అధ్బుత రసాన్ని తెరకి ఎక్కించారు. గంగ దిగేప్పుడు సుద్ద కురిపించారు అదే శివుడి శిరస్సుపై దిగుతున్న  గంగలా కనిపించింది.  విశ్వామిత్రుడు రామ లక్ష్మణులకు రఘు వంశంలోని పూర్వీకుడు అయిన భగీరథుడు గురించి పరిచయం చేసే సందర్భంలో పాట ద్వారా దీన్ని చూపడం జరిగింది. మనోహరమైన అంత్య ప్రాసలతో గంగా ప్రవాహ స్వభావానికి అనుగుణంగా ప్రవాహ భ్రమని కలిగించే శబ్దాలతో ఈ  పాట రాయడం గమనించవచ్చు.

"ఉరికింది ఉరికింది గంగా ఉన్మత్త మానస విహంగా ...

జలా జలా పారుతూ గలగలా సాగుతూ

చెంగుమని దూకుతూ చెలరేగి ఆడుతూ

తుళ్ళుతూ తూగుతూ. ,నిక్కుతూ నీల్గుతూ"

ఇంతటి ప్రవాహాన్ని జహ్నుముని మింగివేసే సరికి భూమిపై గల మనుషుల సాధనా శక్తిని గుర్తించి గంగ తన అహంకార వేగం తగ్గుతుంది అప్పుడు నెమ్మదించిన ప్రవాహ వర్ణన నెమ్మదిగానే ఇలా ఉంటుంది. "తరలింది తరలింది గంగా..." సాగరుల పాపంబు కడుగంగా సద్గతులు వారి కొసగంగా అల భగీరథుని పేరిల నిలవంగ ఇలా గంగ అనే అంత్య ప్రాసలతో గంగా ప్రవాహ స్వభావాన్ని జోడిస్తూ రాసిన పాట ఇది. గంగను భరించడానికి శివుడు ఒప్పుకొని వస్తే అతడి శక్తిని సవాల్ గా తీసుకోని గంగ రావడాన్ని కవి ఇలా వర్ణిస్తాడు

"సురగంగ గరువంబు విరువంగ నెంచి సంకీర్ణ జటా చటులుపొంగించి దుర్గమ్ముగా మలచినాడు గంగను అద్భుతముగా బంధించినాడు." ఇదే మంజునాథ సినిమాలో "కనులు మూడని నీకు ఓ శివయ్య గంగనాపక గర్వపడి రాకయా! తుళ్లి పడకే చెల్లవింక గంగ వెర్రులు తెలుసు దూకు ఇంక కాచుకో కైలాస లింగా, దూకవే ఆకాశ గంగా-- ఇలా గంగ, శివుడు ప్రత్యక్ష వాదన సంభాషణలాగా కాకుండా చాలా మృదువుగా శివుడు వర్సెస్ గంగ అంశాన్ని చిత్రించాడు బాపు. శివుడు గంగాదేవి సవాల్ ని స్వీకరించి గంగను బంధించిన తర్వాత గంగ పరిస్థితి

“ జడయను అడవిని వడివడి అడుగిడి జాడ ఎరుంగనిదై

తడబడి నడుచుచు గడగడ వడుకుచు ముడివడి పోయినదై

ఒకపరి అటు చని ఒకపరి ఇటు చని మొఖమే చెల్లనిదై ”

తరువాత భగీరతుని ప్రార్థన

" అగుపించని ఆ గగన గంగకై అక్రదించే భగీరథుడు

ఆ మొర విని సురధుని చెర విడిపించెను

కరుణాభరనుడు పురహరుడు. "

ఇలా పాట మొత్తం అంత్యప్రసాలను కూర్చి ప్రవాహం స్వభావ పదాలను పెట్టి ఆరుద్ర చాలా నైపుణ్య వంతంగా పాట రాశారు. కవి లక్ష్యం నెరవేరేలా చిత్రీకరణ కూడా జరిగింది. కమ్యూనిస్ట్ భావజాలం గల ఆరుద్ర గంగావతరణ వర్ణన శివుడి వర్ణన చేయడం ఒక ప్రత్యేకత " పాటను కళాత్మకంగా రాయాలన్నా, చిత్రించాలన్నా చాలా కష్టం. కవి భావనకు అతని ప్రతిభాశక్తి కొలది అతను ఉపదేశానికై పాటలో ప్రయత్నించవచ్చు. అవి సినిమా కథకు చక్కగా తోడు కావచ్చు. దానితో సినిమా లేదా సినిమాలోని ఒక సంఘటన రక్తి కట్టవచ్చు. ఒక ఆధ్యాత్మిక గీతం రాసేప్పుడు ఆయా సంఘటన, నటుడిలో లేదా ఆయా పాత్రల్లో లీనమై ఒక విప్లవాభ్యుదయ కవి, లేదా నాస్తిక కవి కూడా రామునిపై, కృష్ణునిపై పురాణాలపై ఉపదేశాలు, ప్రబోధాలు చెప్పే విధంగా పాటను రాయొచ్చు అది కవి పూర్తి స్థాయిలో నమ్మినా, నమ్మక పోయిన అది కవి యొక్క అంతరంగ భావాలకు, కవియొక్క కవిత్వ భావాలకు ప్రతీక. (చంద్రశేఖర్ బూర్ల పుట. 8- పా.సూ 2 ) " ఆరుద్ర ఇంత వరకు గంగావతరణంకు స్సమర్థవంతమైనది సీతాకళ్యాణం సినిమా తప్ప వెరే లేదు.

## 7. సీతాకళ్యాణం-నటన:

సీతా కళ్యాణం సినిమాలో చెప్పవలసిన మరో అంశం నటన. దాదాపుగా అందరు సేనియర్ నటులనే ఇందులో తీసుకోవడం జరిగింది. దశరథుడి పాత్ర గుమ్మడి వెంకటేశ్వర రావు గారు పోషించగా కైకేయి పాత్రలో జమున నటించారు. అయితే సంపూర్ణ రామాయణం సినిమాలో కైకేయి పాత్రకి ఉన్నంతత నిడివి ఇందులో అవసరం లేనందున జమున గారి నటనా ప్రదర్శనకు ఎక్కువ అవకాశం లేదు. కానీ నా రాముణ్ణి అడవికి పంపుతున్నాను అనే క్ డైలాగ్ భవిషత్తులో కావాలని కైకేయి రాముణ్ణి అడవికి పంపుతుంది అనే సూచన ఇచ్చి ఇందులో లేని కథను కూడా సూచిస్తాడు దర్శకుడు. రావణాసురుడిగా సత్యనారాయణ నటించారు అయితే ఇందులో రావణాసురుడి పాత్ర నిడివి కూడా ఎక్కువ అవకాశం లేదు. అందుకే సినిమా మొత్తం ఎక్కువ అవకాశం ఉన్న పాత్రలు సీతా రాములే కానీ అవి నటన ద్వారా కాకుండా కేవలం సౌందర్యాన్ని ప్రదర్శించడం వరకే పరిమితం అయ్యాయి. ఆ ప్రక్రియద్వారానే సినిమాలో ఎక్కువ ప్రయోజనం సాధించాడు దర్శకుడు. బొమ్మను చూపడమే చిత్రకారుడి పని అంతే తప్ప ఆ బొమ్మ మాట్లాడాలని కదలాలని చిత్రకారుడు కోరుకోడు. బొమ్మ ప్రదర్శన ద్వారానే కళాసౌందర్యం సాధిస్తాడు. చిత్రకారుడు బాపు తీసిన సినిమా ఇది అందుకేనేమో సీతా కళ్యాణం సినిమాలో సీతా రాములు ఎక్కువ మాట్లాడరు. మాటను మించిన కళా వైభవం ప్రదర్శిస్తారు. సీతా రాములు పరస్పరం ఒకరి నొకరు మొదటి సారి చూసుకునే సందర్భంలో "ఆ రెండు చూపులు ఒకసారి కలిసే అతిలోక ప్రణయాలు అందులో వెలిసే " ఇలా పాట ద్వారానే నటన ప్రదర్శన జరుగుతుంది. ఇందులో నటనకు ఎక్కువ నిడివి ఉన్న పాత్రలు దశరథుడు, విశ్వామిత్రుడు ఇద్దరు మాత్రమే. వీటిని గుమ్మడి , ముక్కామాల గార్లు చక్కగా చేశారు.

## 8. సీతా కళ్యాణం- దృశ్య చిత్రణ:

సీతా కళ్యాణంలో దృశ్య చిత్రణలో కూడా సౌందర్యకళ కనిపిస్తుంది కళ్యాణ ఘట్టంలో సీత తెల్లని ముత్యాల తలంబ్రాలు పట్టుకున్నప్పుడు ఆమె చేతి గోరింటాకు వలన ముత్యాలు ఎర్రగా మారడం వాటిని రాముని తలపై పోయగానే నీలి వర్ణపు రాముడు కనుక అవి నీలంగా మారడం అనే దృశ్య చిత్రణ కావ్య వర్ణనను పోలి ఉన్నది. వామనావాతారంలో వడుగు వచ్చే చోట కూడా దృశ్య చిత్రణ అపురూప దృశ్యం. "ఎక్కడిదీ పసి వెలుగు ఎవ్వరి వాడో ఈ వడుగు అంటూ వడుగు వైపూ అందరి దృష్టి పడేలా చిత్రించిన సన్నివేశం రమ్యమైనది "ఏ ఊరు ఓ బాబు నీది ఊరేగు వాణి ఉరేది? ఏ పేరు ఓ బాబు నీదీ ఊరేగు వాణి ఉరేది? ఊరేగు వాని ఊరేది " ప్రశ్న సమాధానం ఇలా సంభాషణ జోడించడం జరిగింది.

## 9. ముగింపు:

సీతా కళ్యాణం సినిమా గురించి ఎన్ని విశేషాలు చెప్పినా ఇంకా మిగిలే ఉంటాయి.అయితే సీతా కళ్యాణం సినిమా ఆ కాలంలో వ్యాపార పరంగా ఎక్కువ విజయం సాధించ లేదని చెప్తారు. అందుకు కొత్త నటున్ని రామునిగా తీసుకోవడం కారణం అంటారు కానీ బహుశా పాటల ద్వారా కథ నడపడం మరియు కథనం కన్నా దృశ్య ప్రదర్శనకి ఎక్కువ సమయం ఇవ్వడం అనేవి కూడా ఆ కాలంలో ప్రేక్షకులకు

ఇంకా చేరలేదు అని నా అభిప్రాయం. సీతా కళ్యాణం అనేది సినిమా చూసి మర్చిపోయేది కాదు సౌందర్యాన్ని అనుభవించి కలవరించేది, సినిమా ద్వారా కళావైభవం సాధించడం అనే పనికి గొప్ప నిదర్శనం సీతాకళ్యాణం.

**10. పాదసూచికలు:**

1. తెలుగు వికీపీడియా- సినిమా వ్యాసం
2. బూర్ల చంద్రశేఖర్ - తెలుగు సినిమా పాట ప్రబోధత్మకత.

**11. <u>ఉపయుక్త గ్రంథ సూచి</u>**


1. ఆరుద్ర 2007 - సమగ్ర ఆంధ్ర సాహిత్యం , తెలుగు అకాడమీ, హైదరాబాద్.
2. చంద్రశేఖర్ బూర్ల 2018- తెలుగు సినిమా పాట ప్రబోధత్మకత కర్షక్ ప్రింటర్స్ హైదారాబాద్
3. తెలుగు వికీ పీడియా (వెబ్ సైట్)
4. డా.. నారాయణ రెడ్డి.సి 1997- ఆధునికాంధ్ర కవిత్వం- సంప్రదాయాలు, ప్రయోగాలు, విశాలాంధ్ర, హైదరబాద్.
5. ముళ్ళపూడి వెంకటరామణ 2016 -ఇంకోతి కొమ్మొచ్చి, ఎమెస్కో పబ్లికేషన్స్ , హైదారాబాద్ ISBN MANIMN4092
6. రామారావు .ఎస్వీ 2007- తెలుగులో సాహిత్య విమర్శ, పసిడి ప్రచురణలు, ఖమ్మం.
7. సీతాకళ్యాణం (యౌట్యూబ్ సినిమా)
8. సుబ్రహ్మణ్యం , జి.వి.2005- సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు.